ప్రజాశక్తి
మంగళవారం 4 మార్చి 2025
5
విజయనగరం



తెరుచుకున్న నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల జ్యూట్ మిల్లు సోమవారం తెరుచుకుంది. మిల్లు తిప్పడానికి యాజమాన్యం నోటీసు జారీ చేసి నిర్వహణ పనులు ప్రారంభించింది. ఈ సందర్భంగా జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు గేట్ మీటింగ్ పెట్టి మాట్లాడారు. కార్మికుల శాంతియుత పోరాటం ఫలితంగా మిల్లు తిరుగుతుందన్నారు. గత 9నెలలుగా యాజమాన్యం అక్రమ లాక్‌అవుట్ చేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినా కార్మికుల శాంతి యుత పోరాటంతో దఫదఫాలుగా చర్చలు జరిపి ముందుగా బోనస్ సాధించారన్నారు. మిల్లు తిరగడానికి పార్టీలకతీతంగా కార్మికులు ఎంతో సకరించారని ధన్యవాదాలు తెలిపారు. కార్మికులు ఇదే స్ఫూర్తిని కొనసాగించి సమస్యలు ఎదురైతే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కాగా మిల్లులో ఎలాంటి సమస్య వచ్చినా తనకు సమాచారామిస్తే అండగా నిలుస్తానని రామారావు భరోసా ఇచ్చారు.

ఉత్కంఠ పోరులో విజేత గాదె

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీనివాసులునాయుడు
- 'కూటమి' అభ్యర్థి రఘువర్మ ఓటమి
- తడబడిన గురువులు.. చెల్లని ఓట్లే 656

ఓట్ల లెక్కింపులో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి జరిగిన ఉత్కంఠ పోరులో పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేనకు ఈ ఎన్నికల్లో గురువులు గట్టి గుణపాఠం నేర్పినట్టయింది. కూటమి మద్దతిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గురువులు ఓడించి గాదెకు మూడోసారి పట్టం కట్టారు. అయితే కూటమిలో భాగస్వామి అయిన బిజెపి మాత్రం రఘువర్మకు గాకుండా పిఆర్‌టియూ బలపరచిన గాదెకు మద్దతుగా నిలవడంతో కూటమి పార్టీల్లో 8 నెలల తిరక్కముందే రాజకీయ విభేదాలు బయట పడ్డట్టయింది. ఇది టిడిపి కూటమికి తొలి ఎదురుదెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. టిడిపి మద్దతుతో గత ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచిన వేపాడ చిరంజీవిరావు సైతం రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేసినా ఉపాధ్యాయులు కన్నెత్తి చూడలేదు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం, జనసేన విస్తృతంగా రఘువర్మకు తమ తమ నాయకులతో ప్రచారం సాగించినా వారికి ఫలితం దక్కలేదు. 710 ఓట్ల ఆధిక్యతతో గాదె శ్రీనివాసులునాయుడు విజేతగా నిలిచారు.

తొలి రౌండ్ నుంచీ గాదె ఆధిక్యం...

ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, కూటమి మద్దతుతో ఎపిటిఎఫ్ అభ్యర్థి పి.రఘువర్మ, బిజెపి మద్దతిచ్చిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. గతనెల 27న జరిగినపోలింగ్‌లో 20,791 ఓట్లు పోలయ్యాయి. సోమవారం విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి ప్రాధాన్యత ఓట్లలో శ్రీనివాసులునాయుడుకు 7272 ఓట్లు, రఘువర్మకు 6905ఓట్లు, విజయగౌరికి 5900 ఓట్లు పోలయ్యాయి. ఓట్లలో 656 ఓట్లు చెల్లలేదు. గెలుపునకు అవసరమైన మెజార్టీ రాకపోవడంతో ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్లారు. రాత్రి 8గంటలకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసేసరికి శ్రీనివాసులు నాయుడుకు 9237 ఓట్లు లభించగా అధికార కూటమి బలపరచిన సమీప అభ్యర్థి పాకలపాటి రఘువర్మ (ఎపిటిఎఫ్)కు 8527 ఓట్లు లభించాయి. గెలిచేందుకు 10,068 ఓట్లు రావాల్సి ఉండగా, ఎలిమినేషన్ రౌండ్‌లోనూ ఎవరికీ మెజార్టీ రాలేదు. దీంతో అత్యధిక ఓట్లు సాధించిన గాదె శ్రీనివాసులునాయుడును అధికారులు విజేతగా ప్రకటించారు. రఘువర్మపై 710 ఓట్ల రెండో ప్రాధాన్య ఓటు మెజార్టీతో గాదె గట్టెక్కారు. 8వ రౌండ్‌లో విజయగౌరి ఎలిమినేట్ అయ్యారు. అంతకు ముందే ఎలిమినేట్ అయిన ఏడుగురులో 15 ఓట్ల లోపు వచ్చిన వారిలో ఇద్దరు పద్మావతి, శివప్రసాద్ ఉన్నారు. 548 చెల్లనిఓట్లు పోలవ్వడంతో గురువులు సైతం ఓట్లు వేయలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

ముచ్చటగా మూడోసారి మండలికి

పిఆర్‌టియూ తరపున బరిలోకి దిగిన గాదె శ్రీనివాసులనాయుడు గెలుపుతో 3వ సారి మండలిలో అడుగు పెట్టనున్నారు. రాష్ట్రంలోని కూటమి పార్టీలోని టిడిపి, జనసేన పాకలపాటి రఘువర్మకు మద్దతుగా నిలిచి ప్రచారం చేయగా గాదెకు బిజెపి మద్దతుగా నిలిచింది. శ్రీనివాసులనాయుడు 2007లో పోటీ చేసి ఎంఎల్‌సిగా గెలిచారు. 2013లో మరోసారి గెలుపొందారు. 2019లో రఘువర్మపై ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు టిడిపి, జనసేన మద్దతుగా నిలిచి ప్రచారం మొత్తాన్ని తమ భుజాలపై పెట్టుకుని తిరిగినా టీచర్లంతా తిరస్కరించారు.

ఫలితాల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులునాయుడు

ఓడినా ఉపాధ్యాయుల మధ్యే

కోరెడ్ల విజయగౌరి

గెలుపోటములు అనేవి సహజమని, గెలిచినా ఓడినా ఉపాధ్యాయుల మధ్యనే ఉండి పనిచేస్తానని ఈ సందర్భంగా కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఫలితాలు సందర్భంగా ఆమె స్పందించారు.

తీర్పును స్వాగతిస్తున్నాను

పాకలపాటి రఘువర్మ

ఉపాధ్యాయుల తీర్పును స్వాగతిస్తున్నానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పనిచేసినా ఓడించారని అన్నారు. గతంలో యుటిఎఫ్ మద్దతు ఉండడంతో గెలుపొందానని, ఈ సారి విడిగా పోటీ చేయడంతో ఓటమి చెందానని తెలిపారు. టిడిపి, జనసేన ఆలస్యంగా మద్దతు ప్రకటించాయని అన్నారు.

ప్రాధాన్యతా ఓట్లు ఇలా..

రెండో ప్రాధాన్యత ఓట్లలో వచ్చిన ఆధిక్యతతో గెలుపును గాదె సొంతం చేసుకున్నారు. యుటిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లలో గాదె 1965, పాకలపాటికి 1622 ఓట్లు పోలయ్యాయి. యుటిఎఫ్‌కి వచ్చిన ఓట్లలో రెండో ఓటు వేయని వారు 2313 మంది ఉన్నారు. ఒకటో ప్రాధాన్యత ఓట్లతో గాదెకు లభించిన మెజారిటీ చూస్తే 367గా ఉంది. రెండో ప్రాధాన్య ఓటుతో గాదెకు వచ్చిన మెజారిటీ 1965 ఓట్లు. గాదె మెజారిటీ మొత్తం 710 ఓట్లు.

పాకలపాటి రఘువర్మ

కూటమి ఓటమి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్కారుకు గురువుల ఝలక్
- పోరాడి ఓడిన పిడిఎఫ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాజాగా జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి (టిడిపి, జనసేన) ఓటమి పాలయ్యాయి. కూటమి బలపర్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మపై పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు 710 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ బలపర్చిన కోరెడ్ల విజయగౌరి పోరాడి ఓడారు. మూడో స్థానంలో నిలిచారు. గెలిచిన గాదె, ఓడిన విజయగౌరి సంగతి కాసేపు పక్కనబెడితే... కూటమి ఓటమి మాత్రం ఉమ్మడి విజయనగరం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక విషయంలో టిడిపి తలదూర్చింది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన కూడా సై అంటూ చేతులు కలిపింది. అధినేత ఆదేశాలే తడువుగా ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు, పార్టీ నాయకులు తిరగని చోటు లేదు. ఉపాధ్యాయ ఓటర్లకు వంగివంగి నమస్కారాలు పెట్టారు. కొన్నిచోట్ల ఎన్నికల కోడ్‌ను సైతం ఉల్లంఘిస్తూ స్కూళ్లలోకి చొరబడి ప్రధాన ఉపాధ్యాయుల కుర్చీల్లో కూర్చొని మరీ అధికార దర్పణాన్ని చూపించారు. ఇంతలా అధికార ప్రాభవాన్ని ప్రదర్శించిన కూటమి ఓటమి చవిచూడక తప్పలేదు. ఇక అభ్యర్థి అయితే ఓట్లు అభ్యర్థించడానికి సభలు, సమావేశాల పేరిట విందులు, వినోద కార్యక్రమాలు నిర్వహించి పడరాని పాట్లు పడ్డారు. అయినప్పటికీ ఓటమి తప్పలేదు. దీన్నిబట్టి బెదిరింపులు, అధికార దర్పణాలకు ఉపాధ్యాయులు లొంగిపోరని రుజువైంది. ఉపాధ్యాయులకు సేవ చేసినా ఓడిపోయానని, గతంలో యుటిఎఫ్ మద్దతివ్వడం వల్లే గెలిచానని రఘువర్మ కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో అన్నారు.

శ్రీనివాసులు నాయుడు గెలుపునకు సామాజిక సమీకరణాలు, ప్రాంతీయత, గత ఎన్నికల్లో ఓటమి వంటి సెంటిమెంట్ అంశాలు బాగా ఉపయోగపడ్డాయని పలువురు విశ్లేషిస్తున్నారు. విజయగౌరి ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా గుర్తించిన ఉపాధ్యాయులంతా ఓటేసి అభిమానాన్ని చూపారు. అధికార ప్రతిపక్షాల అండలేకుండా 5900 ఓట్లు సాధించడమంటే చిన్న విషయమేమీ కాదు. అందులోనూ అధికార పార్టీని ఎదురించి ఉపాధ్యాయులంతా ఆమె వెంట నిలబడ్డారు. ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా పోటీ చేసిన విజయగౌరికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు మద్దతిచ్చారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పోటీలో నిలిచిన విజయగౌరి ఇక ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాల్లో మరింతగా దూసుకుపోతారని యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

పాఠశాల విలీనానికి ఒప్పుకోం

ఎంఇఒకు స్పష్టంచేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

పాఠశాల విలీనానికి అంగీకరించేది లేదని విద్యార్థులు తల్లిదండ్రులు.. ఎంఇఒకు స్పష్టంచేశారు. సోమవారం లక్కవరపుకోట దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపిపి స్కూల్-1లోకి దళితవాడలో ఉన్న ఎంపిపి స్కూల్-2ని విలీనం చేయనున్నట్లు చెప్పారు. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించలేదు. ప్రాథమిక పాఠశాల-1 చాలా దూరంగా ఉందని, గత ప్రభుత్వం చేసిన పొరపాటుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే పని చేస్తోందని, దళితుల పట్ల వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ పెద్దలు స్పందిస్తూ ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని, అంతే తప్ప ఇక్కడి విద్యార్థులను మరో పాఠశాలకు మారుస్తామంటే ఒప్పుకునేది లేదని చెప్పారు. దళితవాడలో ఉన్న పాఠశాలను అలాగే కొనసాగించాలని ఎంఇఒను కోరారు. కార్యక్రమంలో సిఆర్ పి బిఎన్ మూర్తి, గ్రామ నాయకులు, ఎస్ఎంసి చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు చేస్తే చర్యలు

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-విజయనగరంకోట

లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు చేసినా, లింగనిర్ధారణ పరిశీలన ప్రోత్సహించే గోడపత్రికలు, హోర్డింగ్‌లు పెట్టినా చట్ట రీత్యా చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. ఆస్పత్రులు, స్కానింగ్‌కేంద్రాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50వేలు నుంచి లక్ష రూపాయలు వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.

నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

- ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం పెరగాలి
- ప్రజా సంతృప్తే ధ్యేయంగా పని చేయాలి
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఎక్కడా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయని విపత్తుల శాఖ ప్రకటించిందని, తాగు నీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, మున్సిపల్ కమిషనర్లతో తాగునీరు, ఉపాధి హామీ, ఎంఎస్ఎంఇ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వారీగా గృహాలకు సరఫరా అవుతున్న తాగునీటి పైప్‌లైన్లను తనిఖీ చేయాలని అన్నారు. వచ్చే మూడు నెలలు కీలకమని, ముందే నీటి ప్రణాళికలను తయారు చేసుకోవాలని, ఇఒపిఆర్‌డిలకు తన పరిధిలో నున్న తాగు నీటి వనరులపై పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు ప్రతి రోజు ఈ అంశం పై సమీక్షించుకోవాలని, ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మత్తులు అవసరమైన వెంటనే చేపట్టాలని, నిధుల కోసం ఆలోచించవద్దని అన్నారు. తాగునీటిపై ఎక్కడా ఎలాంటి ప్రతికూల వార్తలూ రాకూడదని స్పష్టం చేసారు. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా క్రాష్ ప్రోగ్రాం చేపట్టి బోరు బావులను, చేతి పంపులను మరమ్మతులు చేపట్టాలని, ఏ రోజు పని ఆ రోజే చేయాలని అదేశించారు. పారిశుధ్యం కారణంగా వ్యాధులు సంక్రమించకుండా చూసే బాధ్యథ ఇఒపిఆర్‌డిలదేనని అన్నారు.

ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ కోసం నిధులు వచ్చే అవకాశం ఉందని, వచ్చే మూడు వారాల్లో మొదలు పెట్టిన పనులన్నీ పూర్తి చేయాలనీ అన్నారు. వంద రోజులు పని కల్పన ప్రస్తుతం 30 శాతం ఉందని, కనీసం 70 శాతానికి చేరాలని తెలిపారు. అలాగే కనీస వేతనం కూడా పెరగాలని, అందు కోసం రెండు పూటలా పని జరిగేలా చూడాలని తెలిపారు.

ఎంఎస్ఎంఇ సర్వే అక్టోబర్‌లో ప్రారంభం అయ్యిందని, మార్చి 15 లోగా సర్వే పూర్తి కావాలని తెలిపారు. ఇంకనూ 23 వేల వరకు సర్వే చేయవలసి ఉందని, రాజు వారీ లక్ష్యాలను నిర్ణయించుకొని, ప్రతి రోజు సర్వే జరగాలని తెలిపారు. ప్రస్తుతం ప్రధానంగా పారిశుధ్యం, వైద్య సేవలు, ఇసుక, మద్యం, పింఛన్లు అన్న కాంటీన్ల నిర్వహణ తదితర అంశాల పై నిర్వహణా తీరు, అవినీతి, లంచాలు వంటి అంశాల తో ఐ.వి.ఆర్. ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, పంచాయతీరాజ్ , ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు, శ్రీనివాస రావు, కవిత, డిపిఒ వెంకటేశ్వర రావు, జిఎస్‌డబ్ల్యు కో ఆర్డినేటర్ రోజా రాణి, నలుగురు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిలో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 475 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ద్వితీయ ఇంటర్ మొదటి పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన పరీక్షకు మొత్తం 19197మంది హాజరు కావాల్సి ఉండగా, 18722మంది హాజరయ్యారు. 475మంది పరీక్షకు హాజరు కాలేదు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

62 కేసులు.. రూ.6.20 లక్షల జరిమానా

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో ఫైన్ విధించిన ఎజెఎఫ్‌సిఎం కోర్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడితే.. నేరాన్ని న్యాయస్థానాలు తీవ్రమైనవి పరిగణించి, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, 62 కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం విజయనగరంలోని అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. ఎజెఎఫ్‌సిఎం మెజిస్ట్రేట్ బి.రమ్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.6.20 లక్షలను జరిమానాగా విధించారు.

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన నిర్మాణ అనుమతులు ప్రజలకు, భవన యజమానులకు సులభతరంగా అందించేందుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జీఓ 3,4,5,20లో ద్వారా తెలియజేసిందని టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.నాయుడు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు,కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్‌లకు జీఓ లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నిర్మాణాలు సరళీకతం చేసేందుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలనూ అనుమతించవద్దని తెలిపారు. క్షేత్ర స్థాయిలో తిరగాలి,రాత్రి పూట నిర్మాణాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ అధికారి పి నాయుడు మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునే యాజమాని ఎటువంటి ఇబ్బందీ లేకుండా అనుమతి పొందేటట్లు చేయడమే దీని లక్ష్యమన్నారు. రోడ్లు, చెరువులు విషయంలో ఎన్ఒసి తీసుకొని తప్పనిసరిగా రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎసిపిలు ఐవి రమణ మూర్తి, ఎన్.హరిబాబు, ఎడి శ్రావణి, ఎపిఒ ఎం.వాణి అన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్యదర్శులు, లైసెన్సు సర్వేయర్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నాయుడు

మంచి నడవడికతో ప్రతిష్ట పెంచాలి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలని ఎస్‌పి వకుల్ జిందాల్.. ట్రెయినీ ఎస్ఐలకు సూచించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని, జిల్లాకు కేటాయించిన నలుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్స్‌పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాకు రిపోర్టు చేసిన ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కె.సాయిరాం, కె.దుర్గా ప్రసాద్‌తో ఎస్‌పి మమేకమై, వారు ఏమి చదువుకున్నది, శిక్షణ ఏవిధంగా సాగింది, నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో ఎక్కువగా సాంకేతిక అంశాలపై అవగాహన పొందడంతో సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని చెప్పారు.



ట్రెయినీ ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈనెల 8నజరిగే జాతీయ లోక్ అదాలత్‌ను చిట్స్ కంపెనీలు ఉపయోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి.అప్పలస్వామి, జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీలకు సంబంధించిన అధికారులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఇపిలు, ఎక్కువ కేసులను రాజీ చేయాలని వారికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవీ రత్న కుమారి , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి.రమ్య, మొబైల్ కోర్టుజడ్జి పి.బుజ్జి, ఎక్సైజ్ కోర్టుజడ్జి కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో నిలిచిన గూడ్సు రైలు

ఇంజిన్‌లో సాంకేతిక లోపం

నిలిచిన గూడ్స్ రైలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి - డొంకినవలస మధ్యలో సోమవారం గూడ్స్ రైలు నిలిపోయింది. పెంట బ్రిడ్జి సమీపంలో ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో గంటలకు పైగా ఆగిపోయింది. దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొబ్బిలి రైల్వేస్టేషన్లో కోరాపుట్-విశాఖ ప్యాసింజర్ రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే సాంకేతిక సిబ్బంది మరో ఇంజిన్‌ను రప్పించి, గూడ్స్‌రైలును పంపించడంతో యథాతథంగా రాకపోకలు సాగాయి.

కూటమికి ఓటమి రుచి చూపించిన టీచర్లు

జిసిసి మాజీ చైర్‌పర్సన్ స్వాతీరాణి

ప్రజాశక్తి-విజయనగరం

కూటమి ప్రభుత్వానికి టీచర్లు ఓటమి రుచి చూపించారని జిసిసి మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీలకు పరాభవం తప్పలేదని తెలిపారు. 9 నెలలకే ప్రభుత్వంపై టీచర్ల వ్యతిరేకత స్పష్టమైందన్నారు. ప్రభుత్వంపై ఉపాధ్యాయులు తిరుగుబాటు ప్రకటించారని పేర్కొన్నారు. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు చేతిలో కూటమి అభ్యర్థి రఘువర్మ ఓటమి కూటమి ప్రభుత్వానికి చెంపదెబ్బఅని పేర్కొన్నారు.

రెండో రోజూ భక్తుల తాకిడి

ప్రజాశక్తి - చీపురుపల్లి

కనకమహాలక్ష్మి జాతర రెండవ రోజు కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తాకిడి కొనసాగింది. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలతో ప్రత్యేక కోలాట కార్యక్రమాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ ఇఒ బి. శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పిఒ జాగాన విజయలక్ష్మి హెచ్చరించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని 17, 19, 26 వార్డులు, మల్లమ్మపేటలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే బాలికల అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్య సత్వర పరిష్కారం కోసం ఎంపిడిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ జి. భాస్కరరావు తెలిపారు. మండలంలో ఏమారు మూల ప్రాంతానికైనా తాగునీటి సమస్య వచ్చినట్లైతే వెంటనే 8074967684 నెంబర్‌కి డయల్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రాములమ్మ

రీసర్వేను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి వేపాడ

రీసర్వేను రైతులు వినియోగించుకోవాలని తహశీల్దార్ జె.రాములమ్మ కోరారు. మండలంలోని ఆతవ గ్రామంలో తహశీల్దార్ ఆధ్వర్యాన రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమంలో రైతుల వద్దనున్న డాక్యుమెంట్లతో భూములను సరిచేసుకునే అవకాశం లభించిందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం అగ్రహారం, జగ్గయ్యపేటలోని ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఇఒలు జి.నాగభూషణరావు, పి.బాల భాస్కరరావు పరిశీలించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, కిచెన్ గార్డెన్, టాయిలెట్స్, తాగునీరు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

చిట్టి చేతులు.. పెద్ద మనసు

ప్రజాశక్తి-మెంటాడ

చిట్టి చేతులు సహృదయంతో ముందుకు వచ్చి కుష్టు వ్యాధిగ్రస్తుకు ఆపన్న హస్తం అందించాయి. చారు. మెంటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు చేయి చేయి కలిపి విరాళాలు సేకరించారు. లెప్రా సొసైటీ సంస్థ ప్రతినిధి లెంక రమణకు రూ.15,847 మొత్తాన్ని సోమవారం ప్రధానోధ్యాయులు అరుణకుమారి చేతుల మీదుగా విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోధ్యాయులు మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక స్పృహ విద్యార్థి దశ నుంచే అలవడటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

డిఎస్‌పి భవ్యరెడ్డి

ప్రజాశక్తి-బొబ్బిలి

చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. స్థానిక శ్రీగాయత్రి డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మహిళల హక్కులు, సత్ప్రవర్తన, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ అంశాలపై అంతకుముందు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి.కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డీ-అడిక్షన్ కేంద్రాలకు సహకారం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మద్యం, డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి, జీవితాలను చీకటిమయం చేసుకుంటున్న యువతను సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా పోలీసుశాఖ కృత నిశ్చయంతో పని చేస్తుందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటరు, ఎన్‌జిఒ ఆధ్వర్యంలో బాబామెట్టలో నడుపుతున్న విముక్తి కేంద్రాన్ని సోమవారం ఎస్‌పి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ డీ-అడిక్షన్ సెంటరు పూర్తి స్థాయిలో పని చేసేందుకు కావాల్సిన మౌలిక వసతులు, సిబ్బంది కొరత గురించి వైద్యశాఖ అధికారులతో చర్చించామన్నారు. సెంటరుకు అవసరమైన సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. చెడు వ్యసనాల నుంచి బయటపడేందుకు వినోద కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం డీ-అడిక్షను సెంటరులో చికిత్స పొందుతున్న వారితో ఎస్‌పి మమేకమై, వారికి అందుతున్న వైద్యం, భోజనం, ఇతర వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ఆస్పత్రి ఔట్ పోస్టు సందర్శన

ప్రభుత్వ ఆస్పత్రిలోని పోలీసు ఔట్ పోస్టును ఎస్‌పి వకుల్ జిందాల్ సందర్శించి, పనితీరును పరిశీలించారు. ఔట్ పోస్టులో పనిచేసే పోలీసు సిబ్బంది విధిగా యూనిఫాం ధరించాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాల్లో ఏ చిన్న శాంతిభద్రతల సమస్య తలెత్తినా వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.శివ శ్రీధర్, పి.ఎ.రమణి, విముక్తి పిఒ వై.కాళి ప్రసాద్, సైక్రియాటిటీస్ హేమంత్ మాధవ్, జి.బిందు, కౌన్సిలర్ విజయ నిర్మల, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్.శ్రీనివాస్, సూరినాయుడు పాల్గొన్నారు

ఘనంగా మహిళా దినోత్సవ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఆ రోజున వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా పెద్ద ఎత్తున మహిళలకు లబ్ధి చేకూర్చే పథకాలను పంపిణీ చేయాలని సూచించారు. మహిళా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా చేయబోయే సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సుమారు 4 వేల మంది మహిళలతో రాజీవ్ స్టేడియంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఎంపిక చేసిన సుమారు వెయ్యి మందికి ఎన్‌ఎటిఎస్ శిక్షణా కార్యక్రమాన్ని మార్చి 8న ప్రారంభించాలని సూచించారు. డిఆర్‌డిఏ ద్వారా సుమారు రూ.121 కోట్లు, మెప్మా ద్వారా రూ.20 కోట్లు విలువైన బ్యాంకు లింకేజీని అందజేయాలని చెప్పారు. మెప్మా ద్వారా 100 జీవనోపాధి యూనిట్ల పంపిణీకి చేర్పాట్లు చేయాలన్నారు. వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన నలుగురు మహిళలను సన్మానించేందుకు ఏర్పాటు చేయాలని చెప్పారు. 50 ఎంఎస్‌ఎంఇ యూనిట్లను గ్రౌండింగ్ చేయనున్నట్లు చెప్పారు. పిఎం విశ్వకర్మ పథకం క్రింద 97 యూనిట్లను, 150 మందికి నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని, స్టాండప్ ఇండియా క్రింద 50 మందికి, ముద్ర కింద 150 మందికి రుణాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సత్తిరాజు, ఎల్‌డిఎం మూర్తి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

చెరువులోని ఆక్రమణలు తొలగించాలని కోరుతూ మండలంలోని తూడెం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తహశీల్దార్ ఎమ్ సురేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బసవ పాలెం రెవెన్యూ పరిధిలో కూర్మయ్య చెరువును సగభాగం ఆక్రమించి అందులో మామిడి మొక్కలను వేశారని తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండా అందులో మట్టి రోడ్డు సైతం నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని వల్ల ఉపాధి హామీ కూలీలకు ఈ చెరువులో ఉపాధి పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై గ్రామానికి చెందిన గాలి రాజారెడ్డి, దువ్వ అప్పన్న, సమ్మంగి నర్సింగ్‌రావు, రీసు అప్పారావు, దువ్వ రాంబాబు, రీసు గణేష్ తదితరులు వినతి పత్రం అందజేశారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న రైతులు

విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

భోగాపురం విమానాశ్రయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని నెల్లిమర్ల నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రాంతీయ నాయకుల పేర్లు కంటే పేరుగాంచిన అంబేద్కర్ పేరు పెట్టాలని ఆయన అన్నారు.

కెంపో ఇన్‌స్టంట్ డెలివరీ యాప్ అద్భుతం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంతో అభివృద్ధి చెందుతున్న విజయనగరంలో ఇంటివద్దకే సులువుగా అన్ని వస్తువులు చేరువయ్యేలా సాంకేతిక లభించడం ఎంతో గర్వకారణం అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. సోమవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో లికెంపో ఇన్‌స్టంట్ డెలివరీ యాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగపడే విధంగా యాప్‌ను డిజైన్ చేసిన సంస్థ సిఇఒ బోను సంతోష్ ను అభినందించారు. ప్రతి ఒక్కరికి నిత్యం అవసరమయ్యే నిత్యావసర వస్తువులు, మందులు, పాలు, పళ్ళు కూడా తక్కువ సమయంలో చేరవేసే సాధనం ఈ యాప్ లో పొందుపరచడం చాలా గొప్ప విషయమన్నారు.

టిడిపి నాయకులు పిళ్ళా విజయకుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షులు ఆరిశెట్టి సందీప్ యాప్ ద్వారా లభించే సదుపాయాలు తెలియజేసారు. సంస్థ సిఇఒ సంతోష్ మాట్లాడుతూ విజయనగరం ప్రజలకు మేలు జరిగేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు.

పన్నులు చెల్లించి సహకరించండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలు తమ ఆస్తి పన్నులు, ఖాళీ స్థలా పన్నులు, నీటి ఛార్జీలను వెంటనే చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు. శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పన్నులు చెల్లించని వారు వడ్డీభారం కూడా భరించాల్సి వస్తుందన్నారు. పన్నులు చెల్లింపులకు వెసులుబాటు నిమిత్తం ఒక ఆర్థిక సంవత్సరాన్ని నాలుగు త్రై మాసికాలుగా విభజించామన్నారు. అయినా చాలామంది పన్నులు చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. న్యాయబద్ధంగా ప్రతి ఒక్క ఆస్తిదారుడు విధిగా నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించాల్సిందేనని అన్నారు. లేని పక్షంలో ఇళ్ల కులాయి కనెక్షన్లను, కరెంటు కనెక్షన్లను తొలగిస్తామని తెలిపారు.

ఆశీలు వేలం పాట వాయిదా

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రోడ్డు మార్జిన్‌ల ఆశీలు వసూలుకు ఆశీలు హక్కు కోసం ఈనెల 10న వేలం పాట వేయనున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఈనెల 8నజరగాల్సిన వేలం పాట ఎన్నికల కోడ్ కారణంగా 10వ తేదీకి వాయిదా పడినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తగు పత్రాలు బ్యాంకు గ్యారంటీ, సాల్వెన్సీ సర్టిఫికేట్, డిపాజిట్ సహా సోమవారం నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

అబ్బురపరచిన వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-రామభద్రపురం

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని స్థానిక గ్లోబల్ స్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సుమారు 200కు పైగా తయారుచేసిన వివిధ విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బురపరచాయి. ప్రతీ ప్రాజెక్టుపై వివరణాత్మక సమాచారాన్ని విద్యార్థులు సందర్శకులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంధ్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తూ ఇలాంటి ఉత్తమ ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు వారి పరిశోధనా సృజనాత్మకతతో ప్రాజెక్టులు తయారు చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రమోహన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

30 పాఠశాలలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో 30 పాఠశాలలకు కిచెన్ గార్డెన్, మెయింటెనెన్స్ గ్రాంట్లు వంట నిర్వాహకులకు ఎంఇఒలు ప్రసాదరావు, ఎరకయ్య సోమవారం చెక్కుల పంపిణీ చేశారు. ఒక్కొక్క పాఠశాల కిచెన్ గార్డెన్, మెయింటెనెన్స్ నిమిత్తం ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు సమగ్ర శిక్షా విడుదల చేసిన గ్రాండ్లను ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులకు అందజేశారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నేషనల్ చిల్డ్రన్స్‌డే సందర్భంగా నెల్లిమర్ల సెక్టార్ థామస్‌పేట అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం బాల్య వివాహాలపై ఐసిడిఎస్ సూపర్ వైజర్ త్రినాధ అవగాహన కల్పించారు. కనీసం ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండాలని, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండాలని చిన్నవయసులో పెళ్లి చేసుకుంటే చట్టబద్ధంగా నేరమని చెప్పారు. మహిళలు చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని, తల్లులకు కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ నారాయణమ్మ, ఏఎన్‌ఎం ఎర్రమ్మ, అంగన్వాడీ టీచర్స్ రమా, సరస్వతి, డ్వాక్రా ఆర్పీలు, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - జామి

మండలంలోని జాగారం గ్రామంలో సోమవారం పైడితల్లమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పోటీలు అందరినీ అలరించాయి. వేపాడ మండలం వావిలపాడు ఎడ్ల బండి మొదటి బహుమతి కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ జిల్లా దేవరాపల్లి, జామి మండలం కలగాడ గ్రామాల బండ్లు నిలిచాయి. డ్యాన్సు బేబీ డ్యాన్స్ కార్యక్రమం జనాన్ని ఉర్రూతలూగించింది.

'ఆదర్శ' విద్యార్థులకు కుళ్లిన గుడ్లు

ప్రిన్సిపల్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చాలీచాలని భోజనం, కుళ్లిన గుడ్లు పెడుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం విద్యార్థులను చూడటానికి తల్లిదండ్రులు వచ్చే సమయంలో వారంతా భోజనాలు చేస్తున్నారు. వారి ప్లేట్లలో ఉడికీ ఉడకని అన్నం, పప్పు, పాడైపోయిన గుడ్లు చూసి ఆశ్చర్యపోయారు. గుడ్లు కుళ్లిపోయాయని, ఎవరూ తినవద్దని విద్యార్థులకు చెప్పారు. దీంతో విద్యార్థులంతా వెంటనే గుడ్లను పక్కన పడేశారు. వెంటనే ప్రిన్సిపల్ ప్రకాశ్‌రావు వద్దకు వెళ్లి పిల్లలకు చాలీచాలని అన్నం పెడుతున్నారని, కుళ్లిపోయిన గుడ్లను 400 మంది విద్యార్థులకు ఎలా ఇచ్చారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని నిలదీశారు. ప్రిన్సిపల్ స్పందించి, మధ్యాహ్న భోజనంపై సరిగా పర్యవేక్షణ చేపడతామని చెప్పారు

కుళ్లిన గుడ్లు

ఘనంగా ప్రతిష్ట 2కె25 సాంకేతికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతిష్ట 2కె25 సాంకేతికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తాజా సాంకేతికతపై అవగాహన పెంచడానికి, పరిశ్రమ నిపుణులతో మమేకం కావడానికి, నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. కార్యక్రమానికి ఇండియన్ రైల్వే చీఫ్ ఇంజినీర్ డాక్టర్ ఎ.సాయిబాబు హాజరయ్యారు. ఎపిపిఎస్‌సి ఫార్మర్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ్ భాస్కర్, జెఎన్ టి యు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అర్.రాజేశ్వరరావు, డాక్టర్ జి.అప్పలనాయుడు చైర్మన్‌గా పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అనేక ప్రాముఖ్యత గల వర్క్‌షాప్‌లు నిర్వహించారు.

క్రీడా పోటీల్లో మిమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో మిమ్స్ హోమియో వైద్య విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. సోమవారం మిమ్స్ పిఇటి కళా వెంకట్రావు విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటి ఎఎస్ ఆర్ హోమియో వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో మిమ్స్ హోమియో వైద్య విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని తెలిపారు. పోటీల్లో పురుషులు, మహిళా జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. పురుషులు జట్టు క్రికెట్, టేబుల్ టెన్నిస్, డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించగా, మహిళా జట్టు వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, 100, 200, 400 మీటర్లు రిలే పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విజేతలను మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల రావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఎఒ పి. గణేష్ అభినందించారు.

విజేతలైన విద్యార్థులతో కళాశాల ప్రొఫెసర్లు

కెజిబివిని సందర్శించిన ఎపిసి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని మరుపల్లి గ్రామంలోని కెజిబివిని సమగ్ర శిక్ష ఎపిసి రామారావు సోమవారం సందర్శించారు. పాఠశాలలో బోధన కార్యక్రమాలను, నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. అందుతున్న మౌలిక సదుపాయాల పట్ల విద్యార్థులతో మాట్లాడి, తెలుసుకున్నారు. గతంలో మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.సాయికృష్ణారెడ్డి విద్యార్థులకు కళ్ల తనిఖీలు చేయగా, అవసరమైన వారికి సోమవారం కళ్లద్దాలను ఎపిసి అందజేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు ఎంఇఒ విమలమ్మ, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎపిసి రామారావు

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బొండపల్లి పోలీసు స్టేషన్లో 2020లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో నిందితుడు అయిన గంట్యాడ మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన కుప్ప తవిటయ్యకి మహిళా కోర్టు స్పెషల్ జడ్జి ఎన్.పద్మావతి పదేళ్ల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. తవిటయ్య చెడు అలవాట్లకు లోనై, తరుచూ భార్యను అదనంగా కట్నం తీసుకొని రావాలని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో భార్యను చంపాలనే ఉద్దేశంతో నిందితుడు బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామానికి వచ్చి, భార్య, ఇతర కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో పాకకు నిప్పు పెట్టి, హత్యాయత్నంకు పాల్పడ్డాడు. దీంతో అతడిపై బొండపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు.

సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నాగ్‌పూర్‌కు చెందిన కోడ్ ఎఫ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఫోరెన్సిక్ అనలిస్ట్, ఫోరెన్సిక్ ట్రైనీ, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేటర్, క్లైమ్ ఆఫీసర్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు జరిపారు. బిఎస్‌సి, ఎంఎస్‌సి ఫోరెన్సిక్ మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కాలంలో రూ.10వేలు స్టయిఫెండ్ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ శుభమ్ రాజేంద్ర సాహు తెలిపారు. ఇంటర్న్‌షిప్ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కాగా, డైరెక్టర్‌తో పాటు హెచ్ ఆర్ హెడ్ శుబాంగి నీల్ కాంత్ నిఖారే విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పాల వ్యాన్ ఢీకొని లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణ ఆంజనేయపురంలో గల టిడిపి కార్యాలయం ఎదురుగా సోమవారం వేకువ జామున పాల వ్యాను ఢీకొని కర్ణం సత్యం (49) అనే విద్యుత్ శాఖ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. చీపురుపల్లిలో జరుగుతున్న కనకమహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖకు సంబంధించి విధులను నిర్వహిస్తున్న కరణం సత్యం విధి నిర్వహణలో భాగంగా చీపురుపల్లి నుండి గరివిడి వైపు వెళుతుండగా టిడిపి కార్యాలయం సమీపంలో పాల వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం చీపురుపల్లి మండలం పేరిపి గ్రామం. ఆర్‌ఇసిఎస్ నుండి లైన్ మెన్‌గా కరకాం, పత్తికాయవలస గ్రామాల పరిధిలో విధులు నిర్వహిస్తున్నాడు. జాతరలో భాగంగా మొదటి రోజున విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం సంభవించింది. మృతునికి భార్య, కుమారుడు ఉండగా మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్యుమెంట్ పోయినది

రామభద్రపురం మండలం కొట్టక్కి రెవెన్యూ మిర్తివలస పంచాయతీ సాలూరు సబ్ రిజిస్టర్ వారి ఆఫీసు 1 పుస్తకం దస్తావేజు నెం 625/2018 చింతాడ పార్వతి కు చెందిన ఇంటిని మిర్తివలసకి చెందిన చింతాడ నాగరాజు గారు గిఫ్ట్ సెటిల్మెంట్ కొనుక్కున్నారు. ఆ ఇంటి లింక్ డాక్యుమెంట్ ఎక్కడో పోయినది. పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయటం జరిగిందని వారు తెలిపారు. ఆ డాక్యుమెంట్ ఎవ్వరికీ ఎటువంటి ఉపయోగం లేనందున దొరికిన వారు తెచ్చి ఇస్తారని ప్రస్తుత యజమాని చింతాడ నాగరాజు గారు కొరారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDOF AT VIZIANAGARAM
O.S.No 369/2022.

Between:
1. Smt Potluri Rajasri,
2. Sri Potluri Murali Krishna,
3. Sri Potluri Dharani Krishna,
4. Sri Potluri Vamsi Krishna. .....Plaintiffs.

And:
Smt Potluri Lakshmi Sunandha....Defendant.

To
THE DEFENDANT
Smt Potluri Lakshmi Sunandha W/o Butchi Babu, Hindu, aged about 42 Years, Resident of Pathivada Village, Poosapatirega Mandal, Vizianagaram District.

Please take notice that the above named Plaintiffs instituted the above matter against you. Further, along with the said suit, the plaintiff also filed I.A.No 317/2022 for temporary injunction against you. The said suit and the said interim application stands posted to **24th day of March 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.